**Namaste Telangana**

## త్వరలో వర్సిటీలు, డిగ్రీ కాలేజీల్లో

# అధ్యాపకుల పోస్టుల భర్తీ

- రూ.250 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తాం
- 'పింగిళి' స్వర్ణోత్సవంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ఎన్జీవోస్‌కాలనీ, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం హన్మకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో 130 డిగ్రీ కళాశాలల్లో 71కాలేజీలకే న్యాక్ అక్రిడిటేషన్ ఉన్నదని, లేనివాటికి రూసా నిధులు రావని వివరించారు. 2008 తర్వాత ఏర్పాటైన డిగ్రీ కాలేజీలకు అధ్యాపకులను నియమించలేదని, మౌలిక వసతులు కల్పించకపోవడంతో డిగ్రీ కళాశాలలను జూనియర్ కళాశాలల్లో, హైస్కూళ్లలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత పాలకుల తప్పిదాలను, నిర్లక్ష్యాలను తెలంగాణ ప్రభుత్వం సరిచేస్తున్నదని వివరించారు. న్యాక్ అక్రిడిటేషన్ పొందిన డిగ్రీ కళాశాలలకు ల్యాబ్, లైబ్రరీ వసతులను కల్పించేందుకు రూసా నిధులు మంజూరవుతాయని చెప్పారు. అక్రిడిటేషన్ లేని కళాశాలలకు రూ.250 కోట్లతో ల్యాబ్, లైబ్రరీ, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. డిగ్రీ కాలేజీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను సర్వీస్, రోస్టర్ పాయింట్ల ఆధారంగా రెగ్యులరైజ్ చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలలో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టంను ప్రవేశపెట్టామని, దీని వల్ల సెమిస్టర్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. తర్వాత పింగిళి కళాశాలలో స్వర్ణోత్సవ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేయర్ నన్నపునేని నరేందర్, ఎమ్మెల్యేలు కొండా సురేఖ, దాస్యం వినయ్‌భాస్కర్ దితరులు పాల్గొన్నారు.